పదవీ విరమణ ఉద్యోగులకు సత్కారం

విశాలాంధ్ర - మల్కాపురం: హెచ్‌పీసీఎల్ (విఆర్) విశాఖ రిఫైనరీలో పదవీ విరమణ పొందిన వారిని కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వారు ఘనంగా సత్కరించుకున్నారు. గురువారం హెచ్‌పీసీఎల్ ఈడి రత్నరాజు, ప్రాజెక్ట్ ఈడి వీరభద్ర రావు, హెచ్‌ఆర్ చీఫ్ మేనేజర్ జాన్ చర్యన్‌లు పదవీ విరమణ కావడంతో కాంట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మజ్జి సోమేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ములంపాక అప్పారావు, బోగవిల్లి నాగేశ్వరరావు, శ్రీకాంత్, కాకి పొలిరెడ్డి, విజయ్ కుమార్, సత్యాల మహేష్, నాగోతి శ్రీను, బంక శ్రీను, బాగా వెల్లి కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. నిర్ణీత సమయంలోగా ఫలితాలను వెల్లడించేందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రణాళికాయుత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గురువారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి జిల్లాలో చేపట్టిన చర్యలను జిల్లా ఎన్నికల అధికారి సీఈవోకు వివరించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని, మూడంచెల విధానంలో భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచామని చెప్పారు. కేంద్ర బలగాలతో పాటు సుమారు 500 మంది సివిల్ పోలీసులు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. 176 సీసీ కెమెరాలు అమర్చామని, వాటిని మానిటరింగ్ రూమ్‌కు అనుసంధానం చేసి రోజువారీ పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఏయూ పరిధిలో ఏడు హాళ్లు గుర్తించామని, నియోజకవర్గానికి రెండేసి చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 140 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. ఒక్కో టేబుల్ కు గాను ఒక్కో కౌంటింగ్ సూపర్ వైజర్, ఒక్కో కౌంటింగ్ అసిస్టెంటు, ఒక్కో మైక్రో అబ్జర్వర్ను నియమించామని చెప్పారు. పార్లమెంటు పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియను మూడు రౌండ్లలో నిర్వహించనున్నామని, దానికి గాను రెండు హాళ్లను గుర్తించామని, 18 టేబుళ్లను కేటాయించామని వివరించారు. 18 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లను, 36 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, మరొక 18 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని పేర్కొన్నారు. జిల్లాలోని అసెంబ్లీలకు వచ్చేసరికి పార్లమెంటుతో కలిపే అన్ని ఏర్పాట్లు చేశామని అదనంగా పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి మరొక మూడు రౌండ్లు పార్లమెంటు పరిధిలో పెరుగుతాయని స్పష్టం చేశారు. అసెంబ్లీల పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు గాను ఐదు హాళ్లలో 33 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 15 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుందని వెల్లడించారు. 24 మంది అదనపు ఏఆర్వోలు, 33 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 57 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 33 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని జిల్లా కలెక్టర్ వివరించారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి నిర్ణీత కాలంలో శిక్షణ అందిస్తామని, ఈ నెల 25న తొలి విడత ర్యాండమైజేషన్, జూన్ 2వ తేదీన రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం: స్టాలిన్

విశాలాంధ్ర - గాజువాక: మానవాళి మనుగడకు బుద్ధుని బోధనలు ఎంతో అవసరమని 72వ వార్డు కార్పొరేటర్ ఏ.జె స్టాలిన్ అన్నారు. గౌతమ బుద్ధ జయంతి వేడుకలు గురువారం చైతన్య నగర్‌లోని గౌతమ బుద్ధ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరై బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నేడు ప్రజలంతా బుద్ధ జయంతిని ఘనంగా జరుపుకుంటున్నారు అని అన్నారు. శాంతి, సామరస్యానికి ప్రతీక బుద్ధుని బోధనలు అని అన్నారు. ప్రతి ఒక్కరూ బుద్ధుని బోధనలు అనుసరించాలని అన్నారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధ గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.వి.సుబ్బారావును శాలువా, పుష్పగుచ్చంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు జాలాది వెంకటేశ్వరరావు, బాపయ్య, బుచ్చయ్య చౌదరి, వరిష్ఠ పౌరుల సమాఖ్య ప్రతినిధి రమణ రాజు, సీపీఐ నాయకులు కర్రి వెంకటేశ్వరరావు, సలీం, రామారావు, అప్పారీ దానయ్య, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మిల్లెట్స్ బుద్ధ భగవానుడి చిత్రపటం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: బుద్ధ పూర్ణిమ పురస్కరించుకుని నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ ప్రత్యేకంగా మిల్లెట్స్‌ను ఉపయోగించి బుద్ధుని చిత్రపటాన్ని తీర్చిదిద్దారు. నాలుగు అడుగులు ఎత్తు, మూడు అడుగుల వెడల్పు కలిగిన ఈ చిత్రపటాన్ని కేవలం మిల్లెట్స్ ఉపయోగించి 20 రోజులు శ్రమించి తయారు చేశారు. బుధవారం ఎంవిపి కాలనీలోని ఏయూ అంతర్జాతీయ విద్యార్థినుల వసతి గృహంలో బౌద్ధ భిక్షువుల మధ్య దీనిని ఆవిష్కరించారు. అనంతరం బౌద్ధ భిక్షువులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మిల్లెట్స్ ఉపయోగించి ఎంతో కళాత్మకంగా సహజత్వం తొణికిసలాడే విధంగా చిత్రపటాన్ని తీర్చిదిద్దిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ఆచార్య ఈశ్వర్ కుమార్, మహిళా హాస్టల్ వార్డెన్ డాక్టర్ కె. రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు. గౌతమ బుద్ధుని ప్రత్యేకమైన చిత్రపటాన్ని తమతో ఆవిష్కరింప చేయడం పట్ల బౌద్ధ బిక్షువులు అమితమైన సంతోషాన్ని వ్యక్తం చేశారు. బుద్ధుని ఆశీస్సులు ఈ రూపంలో తమకు లభించాయని వారు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చోరీ కేసులో ఆరు ల్యాప్ టాప్‌లు, మూడు మొబైల్స్ స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: చోరీ కేసులో నిందితుల నుంచి ఆరు ల్యాప్ టాప్‌లు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ద్వారకా జోన్ సీఐ సిహెచ్. శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమిళనాడుకి చెందిన ఇద్దరు యువకులు గణేష్ శంకర్, మంజునాథన్ మహారాష్ట్ర విశాఖలో చోరీలు చేసి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారన్నారు. 2021 నుంచి ఇక్కడ నేరాలు చేస్తున్నారని, ఇక్కడ 15 రోజుల్లో మూడు చోరీలు చేశారన్నారు. భీమిలి, ఆనందపురంలో కూడా వీరి మీద చోరీ కేసులు నమోద య్యాయని అన్నారు. వీరిని వెంకోజీపాలెం జంక్షన్ వద్ద అరెస్ట్ చేశామన్నారు. గణేష్ శంకర్‌కి భార్య, నలుగురు పిల్లలు ఉండగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడని అన్నారు. మీడియా సమావేశంలో ఎంవీపీ స్టేషన్ క్రైమ్ ఎస్ఐ ఎస్.జగదీష్ పాల్గొన్నారు.

వైభవంగా రెండవ విడత చందన సమర్పణ

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారికి వైశాఖ పౌర్ణమి సందర్భంగా రెండవ విడత చందన సమర్పణ జరిగింది. కొండ కింద గురువారం పౌర్ణమి రోజు ఉత్తరాంధ్ర జిల్లాల బెస్త, యాదవ కుటుంబీకులు స్వామి వారి వరాహ పుష్కరిణిలో స్నానమాచరించి నైవేద్యం పెట్టి గరిడి సేవలతో స్వామివారిని కీర్తిస్తూ నైవేద్యం సమర్పించారు. పిదప నైవేద్యాలు తమతమ కుటుంబ సభ్యులతో భోజనాలు చేసి వారి వారి ప్రాంతాలకు పయనమయ్యారు. కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు దేవస్థానం అధికారులు, సిబ్బంది, పోలీసు వారు కొండపైన, కొండ కింద భక్తులకు కావలసిన కనీస సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు డేగ కన్ను వేశారు.

స్వచ్ఛ సర్వేక్షన్ అవగాహన కార్యక్రమాలలో బీచ్ వీధి వర్తకులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖ సముద్ర తీర పరిశుభ్రతకు మేము సైతం అంటూ విశాఖ నగర బీచ్ వీధి వర్తకుల సంక్షేమ సంఘం స్వచ్ఛందంగా సహకారమందించడం అభినందనీయమని జివిఎంసి 3వ జోన్ వైద్య, ఆరోగ్య సహాయక అధికారి బి.ప్రసాద్‌రావు పేర్కొన్నారు. గురువారం ఆయన జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు విశాఖ కోస్టల్ బ్యాటరీ నుండి పార్కు హోటల్ వరకు ఉన్న వీధి వర్తకులతో స్వచ్ఛ సర్వేక్షణపై అవగాహన కార్యక్రమాలు బీచ్ రోడ్డు అన్నమయ్య పార్కు ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.ఎం.ఒ.హెచ్ బి.ప్రసాదరావు మాట్లాడుతూ విశాఖ సముద్ర తీర ప్రాంతం మన నగరానికి ప్రకృతి వరమని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తీర ప్రాంతంలోని వీధి వ్యాపారులు విశాఖ స్వచ్ఛతకు మేము సైతం అంటూ విశాఖ స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయమని, అందుకు వారికి సముద్ర తీర ప్రాంత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. సుందర విశాఖ నగరానికి నిత్యం పర్యాటకులు, సందర్శకులు సందర్శిస్తున్నందున వారందరికీ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో బీచ్ వీధి వర్తకుల వారి బాధ్యతగా భావించి బీచ్ తీరం లో వ్యర్థాలు పడవేయకుండా సందర్శకులకు అవగాహన కల్పించాలని వారికి సూచించడమైనదని ఎ.ఎం.ఒ.హెచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహావిశాఖనగరపాలకసంస్థ వైద్య ఆరోగ్య శాఖ నుండి శానిటరీ సూపర్ వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్స్పెక్టర్ గోవింద్, విశాఖనగర బీచ్ వీధివర్తకుల సంక్షేమ సంఘం నుండి రమణ, గిడితురు శ్రీను, తెడ్డు శంకరరావు తదితర వీధి వర్తకులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార బద్రత సాధ్యపడుతుందని డాక్టర్ వై.ఎస్.ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.జానకీరామ్ అన్నారు. ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన ఒకరోజు జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అటవీ సంపద తగ్గిపోవడం, గ్రీన్ హౌస్ గ్యాస్‌ల ఉద్గారాలు పెరిగిపోవడం ముప్పుకు కారణంగా మారుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంఘటితంగా, ప్రణాళికాబద్ధంగా పనిచేయాల్సిన అవశ్యకతను వివరించారు. ఏయూ వీసీ ఆచార్య వి.వి.జి.డి.ప్రసాద రెడ్డి మాట్లాడుతూ జీవ సమతుల్యత దెబ్బతినకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి ప్రేమికులుగా ప్రతీ వ్యక్తి మారాల్సిన అవసరం ఉందన్నారు. సర్వప్రాణి సేవ భగవంతుని సేవగా నిలుస్తుందన్నారు. కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం సముద్ర ప్రాణులపైన కూడా ప్రభావం చూపుతున్నాయన్నారు. నేషనల్ బయోడైవర్సిటీ బోర్డ్ సభ్యులు ఆచార్య హంచిలాల్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతల్లో ఒక్క డిగ్రీ పెరుగుదల వ్యవసాయ రంగాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందన్నారు. ఆర్కిటిక్, అంటార్కిట్ ప్రాంతాలపై ఉష్ణోగ్రతల ప్రభావం, పర్యవసానాలను వివరించారు. ఏపి బయో డైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బి.వి.ఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ క్లైమేట్ చేంజ్ ప్రభావంగా జీడీపీ దెబ్బతింటుందన్నారు. పర్యాటకం పేరుతో జీవ వైవిధ్యం దెబ్బతినకుండా చూడాలన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతింటే దాని ప్రభావం ప్రతీ వ్యక్తి జీవితంపై ఉంటుందన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, విభాగాధిపతి ఆచార్య కె.సంధ్య దీపిక తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, ఏపి బయోడైవర్సిటీ బోర్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సదస్సులో విభిన్న ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై డీఎంహెచ్‌ఓ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: డీఎంహెచ్‌ఓ డా. పి.జగదీశ్వరరావు అధ్యక్షతన అడల్ట్ బి.సి.జి. వాక్సినేషన్ కార్యక్రమం డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ కమిటీకి చైర్మన్ జిల్లా కలెక్టర్, కన్వీనర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మెంబర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఈ అడల్ట్ బి.సి.జి. వాక్సినేషన్ 18 సంవత్సరములు దాటిన వారు, టి.బి.కి చికిత్స తీసుకుని తగ్గిన తర్వాత వారికీ, వారి కాంటాక్ట్స్‌కి 18 కంటే తక్కువ ఉన్నవారికి, 60 సంవత్సరములు దాటిన వారికి, పొగాకు అలవాటు ఉన్నవారికి, మధుమేహ వ్యాధి గ్రస్తులు తప్పని సరిగా ఈ వాక్సిన్ వేసుకోవాల్సిందిగా తెలియచేసారు. పంచాయతీ సెక్రటరీస్ ద్వారా అన్ని పంచాయతీలలో జూన్ 2వ వారం నుండి త్వరితగతిన వాక్సిన్ వేసుకునే విధంగా హెల్త్ సిబ్బంది సహకరించాలని కోరారు. అదేవిధంగా అడిషనల్ డైరెక్టర్ డ్రగ్ కంట్రోల్ వారిని తమ డ్రగ్ ఇన్స్పెక్టర్‌ల ద్వారా వాక్సిన్ పోటేన్సి మొదలగు విషయాలు సహకరించాలని కోరారు. డా.పూర్ణేంద్ర బాబు మాట్లాడుతూ అడల్ట్ బి.సి.జి.వాక్సిన్ త్వరిత గతిన అందరు వేసుకోవాలని ఏ విధమైనటువంటి భయానికి లోను కావాల్సిన అవసరం లేదని, ఇది టి.బి. రాకుండా చేస్తుందని ఇది 18 సంవత్సరములు దాటిన వారందరూ వేసుకోవచ్చునని లైన్ డిపార్ట్మెంట్స్ వారందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డా. జీవనరాణి, విజయ్‌కుమార్, కమలాకర్ భట్టు, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భీమిలిలో గెలుపు మనదే: ముత్తంశెట్టి

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బూత్ స్థాయి లెక్కింపు ఏజెంట్ నాయకుల సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భీమిలి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలుస్తామని ముందుగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా జూన్ 4 వతేదీన జరిగే ఎన్నికల లెక్కింపు సమయంలో ప్రత్యర్థులు తప్పుడు ప్రయత్నాలకు పాల్పడతారని కావున ప్రతి ఏజెంట్ ఎన్నికల లెక్కింపు సమయంలో ఎన్నికల అధికారులకు సహకరిస్తూ సమయస్ఫూర్తిగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారుల పట్ల బాధ్యతగా ఉండాలి

విశాలాంధ్ర - మల్కాపురం: దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని, వారిని విద్యావంతులను చేయాలని విశాఖ జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం బాలల స్థితిగతులపై ఆయన మాట్లాడారు. బాలల అభివృద్ధికి, సంక్షేమానికి అంతా కృషి చేయాలని అన్నారు. వలస కూలీల పిల్లల పట్ల, అత్యంత వెనుకబడిన వర్గాల వారి పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి వసతి గృహాలను విరివిగా నిర్మించాలని అన్నారు. చిన్నారులు కూడా చదువుపై దృష్టి పెట్టాలని, సమాజంలో వస్తున్న మార్పులను తెలుసుకోవాలని, ఇంటి పనులలో తల్లిదండ్రులకు సహాయ పడాలని, క్రమశిక్షణతో ఉండాలని అన్నారు. అంతకుముందు బుద్ధ పూర్ణిమ సందర్భంగా బుద్ధునికి గ్రంథాలయాధికారి అజయ్ కుమార్, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి, ప్రముఖ కవి కె.సత్తిరాజు నివాళులు అర్పించారు. అంతా గౌతమ బుద్ధుని జీవిత చరిత్రపై చర్చించారు. అనంతరం బొకేల తయారీ కార్యక్రమాన్ని అనసూయా దేవి ఆధ్వర్యంలో చిన్నారులు చేశారు.

మట్టి ఆక్రమణ స్థలాన్ని అధికారుల పరిశీలన

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - ఆనందపురం: మండల ంలోని భీమన్న దొరపాలెం పంచాయతీ కోలవానిపాలెం, పప్పలవానిపాలెం చెరువు, పొలాలలో మట్టి దందా అనే వార్తపై విశాలాంధ్ర దిన పత్రికలో వచ్చిన కథనానికి రెవెన్యూ మైనింగ్ అధికారులు స్పందించి గురువారం స్థల పరిశీలన చేశారు. మైనింగ్ డిపార్ట్మెంటు ఆర్ఐ సి.హెచ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్ శైలజ సుభాని స్థానిక విఆర్ఓ ప్రియనాధ్ సంఘటనా స్థలానికి చేరుకుని మట్టి ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. మట్టిని రెండు రోజుల నుంచి రెండు జెసిబిలతో తవ్వి, లారీలతో రవాణా చేసుకొని ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇటీవల మట్టిదందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వంట పొలాల్లో సారవంతమైన మట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలించి, దళారులు లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ల్యాండ్ మైనింగ్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సుమారు 250 క్యూబిక్ మీటర్ల మట్టిని తీసుకెళ్లినట్లు గుర్తించారు. స్థానిక రెవెన్యూ అధికారులకు రిపోర్ట్ అందిస్తామని తదుపరి చర్యలు చేపడుతున్నట్లు మైనింగ్ రెవెన్యూ ఆర్ఐ ఆంజనేయులు తెలిపారు.

సంజీవని నిధికి హెచ్.పి.సి.ఎల్. ఉద్యోగులు రూ.6.45 లక్షల విరాళం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలోని పేదలకు, అనారోగ్య బాధితులకు సాయం చేయాలనే దృక్పథంతో నెలకొల్పిన సంజీవని నిధి - డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు నిధులు ఇచ్చేందుకు స్థానిక హెచ్.పి.సి.ఎల్. ఉద్యోగులు సహృదయంతో ముందుకొచ్చారు. తమ వంతు సాయంగా ఉద్యోగులంతా కలిసి రూ.6,45,000 విరాళంగా అందించారు. సదరు మొత్తాన్ని సంజీవని నిధి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ మేరకు హెచ్.పి.సి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్ రాజ్ జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జునను కలిసి సంబంధిత పత్రాలను అందజేశారు. విశాఖ రిఫైనరీలో పని చేస్తున్న ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి పేదల సహాయార్థం నెలకొల్పిన సంజీవని నిధికి తమ వంతుగా ఆర్థిక సాయం అందించారని తెలిపారు. హెచ్.పి.సి.ఎల్. ఉద్యోగుల చూపిన చొరవను, దాతృత్వాన్ని జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. విరాళాలు అందించిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హెచ్.పి.సి.ఎల్. ఉద్యోగుల చూపిన చొరవ మిగిలిన అందిరిలో తప్పకుండా స్ఫూర్తిని నింపుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. గ్రంథాలయ అధికారిణి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో నలుగురు రిసోర్స్ పర్సన్స్ పాల్గొని విద్యార్థులకు పలు రకాల శిక్షణ ఇచ్చారు. గురువారం కథలు చదవడం, కథలు రాయడం, కథలు చెప్పడం కార్యక్రమం నిర్వహించి అనంతరం మెడిటేషన్ చేయించారు. అలాగే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయటానికి పేపర్ క్రాఫ్ట్ కార్యక్రమం నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు చక్కని సమాధానాలు చెప్పిన భవ్యకు బహుమతులు అందజేశారు.

ప్రైవేట్ పాఠశాల మూసివేత

విశాలాంధ్ర - పెదగంట్యాడ: చిన గంట్యాడ శ్రీ విద్యా ఇంగ్లీష్ మీడియం పాఠశాల భవనం 2023-24 విద్యా సంవత్సరంతో కాల పరిమితి ముగిసినప్పటికి పాఠశాల యాజమాన్యం లీజ్ డీడ్ రెన్యువల్ చేసుకోలేని కారణంగా పాఠశాల యొక్క ప్రభుత్వ గుర్తింపును రద్దు చేస్తున్నట్లు గాజువాక మండల విద్యా శాఖాధికారులు యమ్.సునీత, విశ్వనాధంలు ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు రద్దు చేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యానికి ముందుగా తెలియపరిచినట్టు తెలిపారు. కావునా ఆ పాఠశాలలో పిల్లలను ఈ విద్యా సంవత్సరం నుండి ఎవ్వరూ చేర్పించవద్దని తల్లిదండ్రులకు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గుర్తింపు లేని ఏ పాఠశాలలోనూ పిల్లలను చేర్పించవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

నందవరపు సోములుకు సత్కారం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గోపాలపట్నంలో సామాజిక సేవలో 37 వసంతాలు పూర్తయిన సందర్భంగా నందవరపు సోములకు కళా సేవా పీఠం ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షులు చందు సుబ్బారావు ప్రసంగిస్తూ సామాజిక సేవలో ఒక నూతన అధ్యాయాన్ని ఒరవడిని సృష్టించిన ఘనత నందవరపు సోములుకే దక్కుతుందన్నారు. 1987వ సంవత్సరం డా. వి.ఎస్.కృష్ణా గవర్నమెంట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న రోజులలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్‌గా సేవ చేయడం ప్రారంభించారన్నారు. మహిమాన్విత మహిళగా పోప్ జానపాల్ ప్రకటించిన ప్రపంచ ప్రఖ్యాత సంఘ సేవకురాలు మదర్ థెరీసా ఆంధ్రా యూనివర్సిటీలో ఒక కార్యక్రమంలో పాల్గొనగా వాలంటీర్‌గా ఆమెను సోములు కలిసారన్నారు. ఆమెను స్ఫూర్తి గా తీసుకుని ఇతరులకు మనకు చేతనైన సహాయం ఎందుకు చేయలేమని భావించి విద్యార్థి దశలోనే వయోజన విద్య, అక్షరజ్యోతి, మొక్కలు నాటే కార్యక్రమం, శ్రమధాన కార్యక్రమాలలో పాల్గొని అందరిచే ప్రశంసలు పొందారన్నారు. కార్యక్రమంలో కళా సేవ పీఠం సభ్యులు గౌరవ అధ్యక్షులు కంపర అప్పారావు, అండిబోయిన శ్రీనివాస్, మిద్దె అప్పారావు, జి.బంగ్గారాజు, టి.రామారావు, పాణిగ్రాహి, అల్లు నారాయణరావు, డీఎస్. నాయుడు, ఎల్లపు రమణారావు, బందారు త్రినాథ్, టి.రామచంద్రరావు, వెంకట్, ఎం.ఎన్. వి.శ్రీనివాస్, సాలాపు శ్రీనివాసరావు, ఎస్.వి.నరసింహ, బల్ల రమణ, కంచిపాటి వెంకటరమణ, కట్ట పెంటయ్య, సి.హెచ్.దుర్గా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ సంతకం చేసిన నేను పెదకోరాడ నుంచి గోపాలరెడ్డి నగర్‌లో గల మా లాయర్ గారితో కలియడానికి వెళ్లిన సందర్భంలో 28-3-2024 సా 6 గం.లకు నాయొక్క అమ్మమ్మ అయిన కోరాడ కొండమ్మ w/o లేటు పైడయ్య గారి వారసత్వ ధృవీకరణ పత్రం (legal heir certificate) పోయింది. నేను ఎంత వెదికినా దొరకని కా రణంగా న్యూపోర్టు పోలీసు వారికి రిపోర్టు చేయడం జరిగింది. పోలీసు వారు కూడా దీనిపై దర్యాప్తు జరుపుచున్నారు. అందువలన పైన తెలిపిన వారసత్వ ధృవీకరణ పత్రం ఎవరికైనా దొరికినట్లయితే తమరు దయ తలచి ఈ కింది చిరునామాకు పంపించ వలసిందిగా మిక్కిలి వినమ్రతతో తెలియజేస్తున్నాము.

తేది 23/5/2024
గాజువాక

ధర్మాల వెంకటేశ్వరరావు
s/o రామిరెడ్డి, డో.నెం. 21-54-39, పెదకోరాడ, పెదగంట్యాడ, విశాఖపట్నం - 44,
సెల్: 8639183794

'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జూన్ 1న ఎగ్జిట్ పోల్స్ 4న సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో అనకా పల్లి జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించటమే ధ్యేయంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సమక్షంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్మ్డ్ రిజర్వ్ , లా అండ్ ఆర్డర్ పోలీస్ సిబ్బందితో జిల్లా ప్రధాన కేంద్రంలో నెహ్రూ చౌక్ వద్ద గురువారం మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, 144 సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో, ప్రజల శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదరగొట్టాలి అనే పద్ధతిలో భాగంగా అక్రమ జన సమూహాలను కంట్రోల్ చేయుటకు మొదటగా వార్నింగ్ ఇచ్చుట, అది వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగించుట, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ చార్జ్, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ ప్రయోగించుట, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికి పరిస్థితి అదుపులోకి రాని ఎడల ఫైరింగ్ చేయుట వంటివి ఈ మాక్ డ్రిల్ లో ప్రదర్శించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరి మూకలను అణచి వేసేందుకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక టీములు ఏర్పాటు చేయడం జరిగిందని. ప్రశాంత వాతావరణంలో ప్రజాజీవనం జరిగేలా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ మాక్ డ్రిల్ చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది , ఫైర్ సర్వీస్ అధికారి నర్సింగరావు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, ఎస్.బి డీఎస్పీ అప్పారావు, దిశా డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ట్రైనీ డీఎస్పీ శ్రీమతి భవ్య, ఇన్స్పెక్టర్లు మన్మధరావు, సతీష్, శంకరరావు, శ్రీనివాసరావు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కేటుగాళ్లకు రోజుకో కొత్త ఐడియా

- జనాలను బురిడీ కొట్టిస్తున్న సైబర్ నేరగాళ్లు

- కేటుగాళ్లు చేతిలో రక్షణ శాఖ విఫలం

విశాలాంధ్ర - చోడవరం: ప్రజలను, వారి ఆస్తులను రక్షించేందుకు ప్రభుత్వ రక్షణ శాఖ సైబర్/ కేటుగాళ్లు చేతిలో విఫలమవుతోంది. రోజుకో కొత్త ఐడియాతో ఎక్కడో దగ్గర సైబర్ నేరాలు జరుగుతూనే వున్నాయి. ఎవరో తెలియని వ్యక్తి వచ్చి.. తన ఫోన్ పాడయ్యిందని లేదా బ్యాలెన్స్ లేదని.. తన ఫ్యామిలీకి, ఫ్రెండ్స్‌కు కాల్ చేయాలని మన ఫోన్ అడిగితే.. అయ్యో అని వెంటనే ఇచ్చేస్తాం. మనకు తెలియకుండానే క్షణాల్లో ఆ ఫోన్ కాల్ ఫార్వార్డింగ్, మెసేజ్ ఫార్వార్డింగ్ ఆప్షన్‌ను వారు మార్చేస్తారు.

జస్ట్.. ఫోన్ కీ ప్యాడ్ మీద లిలి401లిలి అని టైప్ చేసి వాళ్ల ఫోన్ నెంబర్ ఎంటర్ చేసి డయల్ చేస్తారు.

అంతే.. ఇలా చేస్తే మనకు తెలియకుండానే మన కాల్స్, మెసేజెస్ అన్నీ కూడా ఆ నంబర్‌కు ఫార్వర్డ్ అవుతుంటాయి. దీనివల్ల మన నార్మల్ మెసేజెస్ మాత్రమే కాకుండా.. మన యూ.పి.ఐ బ్యాంక్ అకౌంట్‌కు సంబంధించిన అన్ని ఓటీపీలు కూడా ఆ నెంబర్‌కు ఫార్వర్డ్ అవుతాయని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మనీలా సందర్శనలో భారత నౌకాదళ నౌకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భారత నౌకాదళ నౌకలు ఢిల్లీ, శక్తి మరియు కిల్తాన్ దక్షిణ చైనా దక్షిణానికి తూర్పు నౌకాదళం యొక్క కార్యాచరణ విస్తరణలో భాగంగా ఫిలిప్పీన్స్‌లోని మనీలా సందర్శనను పూర్తి చేశాయి. భారత నావికాదళానికి చెందిన తూర్పు నౌకాదళాన్ని దక్షిణ చైనా సముద్రానికి ఆపరేషనల్ విస్తరణలో భాగంగా భారత నౌకాదళ నౌకలు ఢిల్లీ, శక్తి మరియు కిల్తాన్ ఫిలిప్పీన్స్‌లోని మనీలాను సందర్శిం చాయి. ఈ పర్యటన ఫిలిప్పీన్స్‌తో భారతదేశానికి ఉన్న బలమైన సంబంధాలను, భాగస్వామ్యాన్ని మరింత లోతుగా చేయడానికి దాని నిబద్ధతను ప్రదర్శించింది. పోర్ట్ కాల్‌లో భారత నౌకాదళం మరియు ఫిలిప్పీన్స్ నేవీ సిబ్బంది మధ్య సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్ ఎక్స్ఛేంజ్, స్పోర్ట్స్ ఫిక్చర్‌లు, క్రాస్ డెక్ విజిట్‌లు, సాంస్కృతిక మార్పిడి మరియు సహకార కమ్యూనిటీ ఔట్రీచ్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. రాజేష్ ధంఖర్, రెనాటో డేవిడ్, రోలాండో లిజోర్ పుంజలాన్‌లు పాల్గొని ఫిలిప్పీన్ కోస్ట్ గార్డ్‌లతో పరస్పరం సంభాషించారు. వైస్ అడ్మ్ టోరిబియో దులినాయన్ అడాసి సహకారం కోసం మార్గాలు, పరస్పర ఆసక్తి ఉన్న అంశాలు, ప్రాంతం, వెలుపల ఉన్న ప్రస్తుత భద్రతా పరిస్థితులపై విస్తృత చర్చలు కూడా నిర్వహించింది. ఈ పర్యటన భారతదేశం ఫిలిప్పీన్స్ నౌకాదళాల మధ్య నౌకాదళ సహకారాన్ని మరియు

పరస్పర చర్యను పెంపొందించడంపై చర్చలకు అవకాశం కల్పించింది. భారతదేశం మరియు ఫిలిప్పీన్స్ మధ్య బలమైన దౌత్య మరియు రక్షణ సంబంధాలకు పోర్ట్ కాల్ నిదర్శనం. ఇది తన 'యాక్ట్ ఈస్ట్' మరియు సాగర్ విధానాలకు అనుగుణంగా ఈ ప్రాంతంలో శాంతి మరియు స్థిరత్వం కోసం భారతదేశం యొక్క నిబద్ధతకు నిదర్శనం.

యువతీ, యువకులకు గొప్ప అవకాశం

విశాలాంధ్ర - చోడవరం: జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ వారు భారత్ స్కౌట్స్ గైడ్స్ సంస్థలో శిక్షణకు 18 సంవత్స రముల నుండి 40 సంవత్సరములలోపు ఉన్న యువతి యువకులకు యువ ఆపద మిత్ర పథకాన్ని ప్రవేశపెట్టారని అనకాపల్లి జిల్లా కార్యదర్శి, స్టేట్ కోఆర్డినేటర్ కొణతాల రత్నకుమారి తెలిపారు. సమీప ప్రాంతములలో ప్రకృతి వైపరీత్యాలు వరదలు, భూకంపాలు, సునామీ వంటివి సంభవించినప్పుడు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థతో పాటు సహాయం చేయుట కొరకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ వారు ఆశక్తి కల యువతి యువకులకు 7 రోజులపాటు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు షరీఫ్ ఫోన్ నెంబర్ 990818696 సంప్రదించాలన్నారు.

నేడు రాంనగర్ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - యలమంచిలి: 33/11 కెవి పెద్దపల్లి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో గల 11కెవి రాంనగర్ ఫీడర్‌కు సంబంధించి లైన్ మెయింటనెన్స్ (చెట్లు తొలగింపు) నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు శేషుకొండ కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, మర్రిబంద, పాత యర్రవరం, రాంనగర్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో బోయపాలెం ఇండస్ట్రియల్, 11కెవి కే.కే.పాలెం 11కెవి పరదేశిపాలెం లైన్ మెయింటనేన్స్ వర్కు కొరకు శుక్రవారం ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు బోయపాలెం, గంబీరం, గంబీరం ఏపీఐఐసీ, కొత్త కల్లివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని విద్యుత్ శాఖ ఏఈ సురేష్ కుమార్ తెలిపారు. గృహ వినియోగదారులు పారిశ్రమాకా వినియోగదారులు, వ్యవసాయ వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలన్నారు.

అంబేద్కర్‌ని అవమానించిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చిన్నముషిడివాడ శ్రీనివాస నగర్ ప్రాంతంలో గల అంబేద్కర్ విగ్రహానికి అవమానం కలిగించిన వారిని వెంటనే శిక్షించాలని మాల మహానాడు ధనుష్ సేన రాష్ట్ర అధ్యక్షుడు పచేశారాలితెట్టి పెంటారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన పెందుర్తిలో మీడియాతో మాట్లాడుతూ సర్వేనెంబర్ 163 లో 2011లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారని, ఈ విగ్రహం పక్కనే గల సుమారు19 సెంట్లు ప్రభుత్వ స్థలంలో దళిత సంఘం నేత దుంబారి రామారావు అంబేద్కర్ సామాజిక భవనం నిర్మాణం ఏర్పాటు కోసం గట్టిగా ప్రయత్నించారని వెల్లడించారు. దీని కోసం పది లక్షల రూపాయలు మంజూరు చేయవలసిందిగా డిప్యూటీ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ తో పాటు జిల్లా కలెక్టర్ కు ఆర్జీ పెట్టగా, సంబంధిత అధికారులు స్థలాన్ని పరిశీలించిపరిశీలించి ఆ 19 సెంట్లు ప్రభుత్వ భూమిని అంబేద్కర్ సామాజిక భవన నిర్మాణం కోసం కేటాయించారని తెలిపారు. అయితే మొన్న ఎన్నికల్లో కొందరు నాయకులు స్వలాభం కోసం ఎన్నికల కోడ్ ని ఉల్లంఘించి అంబేద్కర్ విగ్రహం కనబడకుండా చుట్టూ ప్రహరీ నిర్మాణం చేశారని ఆవేదన వెలిబుచ్చారు. అంతేకాకుండా శిలాఫలకాన్ని కూడా ధ్వంసం చేశారని మండిపడ్డారు. దీనిపై తక్షణమే అధికారులు స్పందించి దోషులను శిక్షించాలని అంబేద్కర్ విగ్రహానికి ఆనుకొని ఉన్న గోడను తొలగించి పార్కు మధ్యలో విగ్రహాన్ని ఉంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేసి ధర్నాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ దుశ్చర్యలకు పాల్పడిన వారు వెంటనే క్షమాపణలు చెప్పాలని లేనిపక్షంలో వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రోటీన్ సప్లిమెంట్లకి బదులు సహజ ప్రోటీన్ కలిగిన ఆహారం తీసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రోటీన్ సప్లిమెంట్లు వాడే కన్నా సహజంగా ప్రోటీన్లు అధికంగా కలిగివున్న ఆహారాన్ని తీసుకోవాలని మ్యాక్స్ హెల్త్‌కేర్ క్లినికల్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ రీజనల్ హెడ్ రితికా సమద్దర్ సూచించారు. ఆరోగ్యం ఆహారం అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుల ఆమె మాట్లాడుతూ కండరాలు, కణజాలాలు హార్మోన్ల కోసం అత్యంత కీలకమైనది ప్రోటీన్ అని, జీవక్రియ నియంత్రణలో ఇది సహాయ పడుతుందన్నారు. రోగనిరోధక పనితీరుకు మద్దతు ఇస్తుందన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ కొత్తగా విడుదల చేసిన ఆహార మార్గ దర్శకాలు శరీర ద్రవ్యరాశిని నిర్మించడానికి వాటిని ఉపయోగించకూడదని సలహా ఇస్తున్నాయన్నారు. ప్రోటీన్ సప్లిమెంట్‌లకు దూరంగా ఉండాలని , బదులుగా బాదం వంటి సహజ ప్రోటీన్లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాదం ప్రోటీన్ నిలయం అని బాదం. ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, విటమిన్ ఈ మెగ్నీషియంతో సహా 15 ముఖ్యమైన పోషకాలతో నిండిన బాదం అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందన్నారు. విటార్డ్ అధ్యయనం ప్రకారం , బాదం తినడం వల్ల వ్యాయామం రికవరీ సమయంలో కండరాల నొప్పి యొక్క కొన్ని భావనలు తగ్గుతా యన్నారు. సలాడ్‌లు, ట్రయల్ మిక్స్‌లు, గ్రానోలా, పప్పు, కాయధాన్యాలు నిజానికి అనేక డైట్ లలో కీలకంగా ఉన్నాయన్నారు. బాదంతో పాటు గ్రీక్ యోగర్ట్, గుడ్లు, పౌల్ట్రీ, చేప, క్వినోవా వీటిలో అధికంగా ప్రోటీన్లు ఉంటాయన్నారు. కనుక ప్రోటీన్ సప్లిమెంట్లు వాడే బదులు ఈ ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

గంటాను కలిసిన గరే గురునాథ్

విశాలాంధ్ర - పీఎం పాలేం : భీమిలి నియోజకవర్గం కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ను గురువారం నాడు తెలుగు యువత ఉపాధ్యక్షులు కేవిఆర్ క్యాటరింగ్స్ అధినేత గరే గురునాథ్ మరియు 6వ వార్డు బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యన్నారాయణ తో సహా సుమారు 50 మందితో గంటా సగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.. పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు..

భీమిలి నియోజకవర్గం లో ఎంత మేర మెజారిటీ వస్తుంది అనే విషయంపై కాసేపు ముచ్చటించారు. రాష్ట్రంలో రాబోయేది కూటమి ప్రభుత్వమేనని, భీమిలి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలుస్తానని గంటా ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిల్ల రమేష్, దాసు, కొరుకూరి చిన్న, ముల్లు సూరిబాబు, బంక వెంకట అప్పారావు, పిల్ల వెంకట అప్పారావు, రాయన శివ, శాన్న బుజ్జి, మహిళలు గండి బోయిన లక్ష్మి, పద్మ, వి లక్ష్మి, రుక్మిణి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్-ప్రోత్సాహ ఫీచర్స్‌ను పరిచయం చేసిన మేక్ మైట్రిప్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతీయ రైల్వేలతో ప్రతి ప్రయాణ అనుభవాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా, మేక్ మై ట్రిప్, ప్రతి రైలు ప్రయాణాన్ని మెరుగు పరచడానికి సాధారణ వినియోగదారుకు సమస్య కలిగించే అంశాలను పరిష్కరించడానికి భారతదేశపు ప్రముఖ ఆన్ లైన్ ప్రయాణ కంపెనీ టెక్-ప్రోత్సాహక ఫీచర్స్‌ను ప్రకటించింది. కంపెనీ ప్రయాణికుల బుకింగ్ అనుభవాన్ని విలక్షణమైన దశలుగా విభజించింది, చురుకుగా టెక్నాలజీని ప్రోత్సహించే పరిష్కారాలను అన్వేషిస్తోంది. రైలు టిక్కెట్స్‌ను బుక్ చేయడానికి సంబంధించి వినియోగదారులకు అత్యంత ముఖ్యమైన విచారాల్లో ఒకటి నిర్ధారిత టిక్కెట్స్‌ను పొందడం ఒకటి. సాధారణంగా, నిర్ధారిత టిక్కెట్స్ కోసం బుక్కింగ్ విండో ట్రిప్‌కు ముందు 120 రోజులకు తెరవబడుతుంది. వేగంగా భర్తీ చేయబడుతుంది, తరచుగా ప్రయాణికులకు వెయిట్ లిస్ట్ టిక్కెట్స్ లభిస్తాయి.

ఐఐఎఫ్‌ఎల్ హెచ్‌ఎఫ్‌ఎల్ ఏయూఎం వృద్ధి

విశాలాంధ్ర -విశాఖ సిటీ: ఎఫ్ వై 23లో రూ. 28,512 కోట్లకు, ఎఫ్ వై 24లో రూ. 35,499 కోట్లకు, ఐఐఎఫ్ఎల్ హెూమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తన అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఏయూఎం)లో వై ఓ వై 25 శాతం పెరిగింది. ఇది సగటు టిక్కెట్ పరిమాణం రూ. 14.26 లక్షలతో భారతదేశపు అతి పెద్ద సరసమైన హౌసింగ్ ఫైనాన్స్ సంస్థగా మారింది. మే 6, 2024 నాటి ఎక్స్ఛేంజ్ రిపోర్టింగ్ ప్రకారం, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్స్ అథారిటీ ద్వారా 20 శాతం వాటాతో ఐఐఎఫ్ఎల్ హెూమ్ ఫైనాన్స్, ఎఫ్ వై 23లో రూ. 2,712 కోట్ల నుండి ఎఫ్ వై 24లో రూ. 3,317 కోట్లకు పెరిగి, 23 శాతం వై ఓ వై వృద్ధిని నమోదు చేసింది.

పన్ను తర్వాత లాభం (పీ ఏ టీ) ఎఫ్ వై 23లో రూ. 768 కోట్ల నుండి ఎఫ్ వై 24లో రూ. 1,017 కోట్లకు 32 శాతం పెరిగింది. నికర వడ్డీ మార్జిన్లు 80 బేసిస్ పాయింట్లు మెరుగుపడ్డాయనీ మోను రాత్రా, ఐఐఎఫ్ఎల్ హెచ్ఎఫ్ఎల్ చెప్పారు.

జాతీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు

విశాలాంధ్ర - చోడవరం: మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం తరఫున అందించే ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తులు కోరుతోంది. 2024- 25 సంవత్సరానికి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు 6 నుంచి 18 ఏళ్ల బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఆవిష్కరణలు, సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్, టెక్నాలజీ, ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన బాలల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల వారు జూలై 31లోగా https://awards.gov.in/Home/AwardLibrary వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



వెనుకబడ్డ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

విశాలాంధ్ర - చోడవరం: ఈ ఏడాది పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సరోజిని దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనం అందిస్తున్నది. విద్యార్థులకు విద్యాదాన్ స్కాలర్‌షిప్స్ కోసం పదవ తరగతిలో 90 శాతం మార్కులు ఉండాలి, ఇంటర్ మొదటి సంవత్సరంలో నమోదు చేసుకోవాలి. విద్యాదాన్ ఉపకార వేతనాలు కోసం దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 7 వరకు సమయం వుందని అధికారులు తెలిపారు. దివ్యాంగులైతే 75 శాతం మార్కులు రావాలి. ఉపకార వేతనం పొందాలంటే ఆ విద్యార్థి కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.2 లక్షల లోపు ఉండాలి. ఈ క్రింది వెబ్ సైట్ ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చును అని తెలియ జేసారు. విద్యాదాన్‌ఏఎస్‌డి ఫౌండేషన్.కామ్ సైట్‌ను సంప్రదించాలి.